# జాతీయ అవార్డులు..
## వీరికి ప్రత్యేక శుభాకాంక్షలు: చిరంజీవి




తాజాగా ప్రకటించిన 71వ జాతీయ పురస్కారాల్లో టాలీవుడ్ సత్తా చాటింది. పలు కేటగిరీల్లో అవార్డులు సొంతం చేసుకొని దేశం దృష్టిని ఆకర్షించింది. అవార్డులు దక్కించుకున్న వారందరికీ సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అగ్ర కథానాయకుడు చిరంజీవి వీరందరికీ అభినందనలు తెలుపుతూ పోస్ట్ పెట్టారు. పురస్కారం గెలుచుకున్న వారి అందరి పేర్లను తన పోస్టో రాసుకొచ్చారు.

"71వ జాతీయ అవార్డు విజేతలకు హృదయపూర్వక అభినందనలు. ఈ పురస్కారాల్లో మన తెలుగు సినిమా మరోసారి మెరిసింది. వీరందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు" – చిరంజీవి

"అభినందనలు షారుక్ ఖాన్. సినిమా ఇండస్ట్రీపై మీరు ఎంతో ప్రభావాన్ని చూపారు. ఈ మధ్యకాలంలో నా హృదయాన్ని కదిలించిన చిత్రం 12 ఫెయిల్. దీనికి అవార్డు ప్రకటించి ఎంతోమందిలో స్ఫూర్తినింపారు. విక్రాంత్ మాస్సేతో పాటు చిత్ర బృందానికి అభినందనలు. ఉత్తమ నటిగా ఎంపికైన రాణీముఖర్జీకి శుభాకాంక్షలు" – కమల్ హాసన్


"బాలయ్య, అనిల్తో పాటు 'భగవంత్ కేసరి' చిత్ర బృందానికి అభినందనలు. ఎంతో గర్వంగా ఉంది. అవార్డులు సొంతం చేసుకున్న వారందరికీ శుభాకాంక్షలు" – వెంకటేశ్

"జాతీయ అవార్డుల్లో తెలుగు సినిమా సత్తా చాటింది. మీ ప్రతిభ భారతీయ సినిమా స్థాయిని మరింత పెంచుతోంది. ఈ విజయాన్ని అందరం సెలబ్రేట్ చేసుకుందాం" – మంచు విష్ణు

"భగవంత్ కేసరి' ప్రతిష్ఠాత్మకమైన జాతీయ అవార్డును సొంతం చేసుకోవడం గర్వంగా ఉంది. బాలమామకు శుభాకాంక్షలు. ఇటీవల వచ్చిన అత్యంత ప్రభావవంతమైన సినిమాల్లో ఇదీ ఒకటి. ఈ అవార్డుకు అనిల్ రావిపూడి అర్హుడు" – నారా రోహిత్

"లెజెండ్ షారుకక్కు అభినందనలు" –ఏఆర్ రెహమాన్

## మా పదేళ్ల పోరాటానికి ఈ అవార్డులే నిదర్శనం: 'ది కేరళ స్టోరీ' దర్శకుడు



దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సినిమా 'ది కేరళ స్టోరీ'. సినీ రంగంలోనే కాదు, రాజకీయంగానూ ప్రకంపనలు సృష్టించిన ఈ చిత్రం తాజాగా ప్రకటించిన జాతీయ అవార్డుల్లో రెండు విభాగాల్లో పురస్కారాలను దక్కించుకుంది. ఉత్తమ దర్శకుడిగా సుదీప్తో సేన్ ఎంపిక కాగా.. ఉత్తమ ఛాయాగ్రహణం విభాగంలో 'ది కేరళ స్టోరీ' గాను పసంతను మొహపాత్రో అవార్డు సొంతం చేసుకున్నారు. దీనిపై దర్శకుడు స్పందిస్తూ 10 ఏళ్ల పోరాటానికి ఈ అవార్డు నిదర్శనమని అన్నారు. "నాకు ఆనందంగా ఉంది. కానీ, ఉత్తమచిత్రంగా ఎంపికై ఉంటే ఇంకా ఆనందంగా ఉండేవాడిని. ప్రేక్షకుల ఆశీస్సుల వల్లే మాకు ఈ అవార్డు వచ్చింది. ప్రజలు ఇప్పటికీ సోషల్ మీడియాలో ఈ సినిమా గురించి మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఓటీటీలో విడుదలయ్యాక దీనికి మరింత ఆదరణ దక్కింది. 70 వారాల్లో దాదాపు 35 వారాలకు పైగా ఈ సినిమా టాప్ 10లో ఉంది. ప్రేక్షకులు మాపై చూపిన ప్రేమకు ఇదే నిదర్శనం. ఈ సినిమా ఇంత విజయం సాధిస్తుందని ప్రారంభించినప్పుడు ఊహించలేదు. దీనికోసం దశాబ్దకాలం పాటు చేసిన పరిశోధనలకు, మా పోరాటాలకు ఈ అవార్డు ప్రతిఫలంగా అనిపిస్తోంది. ప్రేక్షకులు కూడా మొదట ఈ సినిమా కేవలం ఓ మతానికి సంబంధించినదిగా భావించారు. దీన్ని చూశాక వారి భావన తప్పు అని అర్థం చేసుకున్నారు. ప్రతిఒక్కరికీ ఇది కనెక్ట్ అయింది" అని దర్శకుడు చెప్పారు. ఈ అవార్డు వచ్చాక అదాశర్మకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిపారు. 'ది కేరళ స్టోరీ'లో ముఖ్య పాత్ర పోషించిన అదా శర్మ కూడా ఆనందం వ్యక్తంచేశారు. ఈ మూవీ చూసి భావోద్వేగానికి గురైన వారితో పాటు దీన్ని ట్రోల్ చేసి చర్చనీయాంశంగా మార్చిన వారికి కూడా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన మహిళా ప్రాధాన్యత చిత్రంగా ఇది నిలిచిందన్నారు. ఈ విజయానికి కారణమైన వారందరికీ రుణపడి ఉంటానన్నారు. ఇక ఈ సినిమాకు అవార్డులు రావడంపై నిర్మాత విపుల్ అమృత్లాల్ షా కూడా స్పందించారు. ఇది డబుల్ విజయమని అన్నారు. దీన్ని గుర్తించినందుకు జ్యూరీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. దీని చుట్టూ గతంలో వివాదాలు నెలకొన్నప్పటికీ సరైన గౌరవాన్ని ఇచ్చారని కృతజ్ఞతలు చెప్పారు.

### 'ది కేరళ స్టోరీ'కి అవార్డు అందుకే ఇచ్చాం: జ్యూరీ సభ్యుడు

ఇక ఈ సినిమాకు అవార్డులు రావడంపై కొన్ని విమర్శలు ఎదురవుతున్నాయి. కేరళ సీఎం పినరయి విజయన్ కూడా ఈ సినిమాకు అవార్డులు రావడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది కేరళను అవమానించడమేనని ఆరోపించారు. తాజాగా జ్యూరీ సభ్యుల్లో ఒకరైన అశుతోష్ గోవారికర్ ఈ విమర్శల నేపథ్యంలో మాట్లాడారు. దీనికి సినిమాటోగ్రఫీ అవార్డు ఇవ్వడానికి గల కారణాన్ని వివరించారు. ఇందులో సినిమాటోగ్రఫీ చాలా స్పష్టంగా ఉందన్నారు. సినిమాకు తగినట్లు ఉందని దానిని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. అందుకే అవార్డు ఇచ్చినట్లు వెల్లడించారు.



## 'కింగ్డమ్' హిట్టా.. కాదా..: నాగవంశీ ఏమన్నారంటే




విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వచ్చిన 'కింగ్డమ్' ఆదరణను సొంతం చేసుకుంటోంది. ఈ సినిమా నిర్మాత నాగవంశీ, హీరో విజయ్ దేవరకొండ తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'కింగ్డమ్' గురించి మాట్లాడారు. రూ.5 కోట్ల సినిమా అయినా రూ.500 కోట్లదైనా రిలీజ్కు ముందు తాను ఎప్పుడూ టెన్షన్ పడతానని నాగవంశీ అన్నారు."హిట్ పాట ఉన్న సినిమాలకు కూడా ఇటీవల ఓపెనింగ్స్ రాలేదు. ఏ సినిమా హిట్ అవుతుంది. ఏది కాదు అనేది ఎవరూ నిర్ణయించలేరు. ప్రేక్షకులు ఏ చిత్రాన్ని చూడాలనుకుంటున్నారు అనే విషయం అడ్వాన్స్ బుకింగ్స్ చూసేవరకూ తెలియదు. ఒక సినిమా హిట్టా.. కాదా అనే దానికి రెండే కొలమానాలు. జీఎస్టీతో బయ్యర్లు బయటపడితే హిట్. జీఎస్టీ బయ్యర్కు మిగిలితే సూపర్ హిట్ సినిమా. కమిషన్ వస్తే బ్లాక్బస్టర్. 'కింగ్డమ్' ఇప్పటివరకూ చాలా ప్రాంతాల్లో సూపర్ హిట్ లెక్కల్లో ఉంది. మలయాళంలో మేం ఊహించిన దానికంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయి. మరో వారంలో దీని వసూళ్లపై మరింత క్లారిటీ వస్తుంది. ఒక్కోసారి సినిమా విడుదలైన తర్వాత రెండో వారంలోనూ భారీ ఆదరణ దక్కుతుంది" అని నాగవంశీ వివరించారు. "విజయ్ దేవరకొండకు రష్మిక వీరాభిమాని. ఎలా అయినా 'కింగ్డమ్'ను చూడాలని హైదరాబాద్ లోని ఓ థియేటర్ కు వెళ్లారు. సెలబ్రిటీ కావడంతో ఇబ్బందులు వస్తాయని ఆవిడను అనుమతించలేదు. దీంతో ఎవరూ గుర్తుపట్టకుండా ఓ సాధారణ మహిళలా మారువేషంలో భ్రమరాంబ థియేటర్లో సినిమా చూసేసి వచ్చారు" అని నాగవంశీ తెలిపారు. కింగ్డమ్ గురించి విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "ఎన్నో ఏళ్ల తర్వాత నా సినిమా చూసిన అభిమానుల కళ్లలో ఆనందం కనిపించింది. వాళ్లు ఎంజాయ్ చేసినట్లు వాళ్ల మాటల్లో నాకు అర్థమైంది. 'ఖుషి' విషయంలోనూ నేను సంతోషంగానే ఉన్నాను. 'ఫ్యామిలీ స్టార్' విషయానికొస్తే.. నాకు ఆ ఐడియా చాలా నచ్చింది. కథ చెప్పినప్పుడు నవ్వుకున్నాం. చాలామంది ప్రేక్షకులు 'గీత గోవిందం' లాంటి మూవీ మరోసారి తీయమని నన్ను ఎన్నోసార్లు అడిగారు. అందుకే 'ఫ్యామిలీ స్టార్' తీశాను. దాంట్లో అన్నిరకాల ఎలిమెంట్స్ ఉన్నాయి. ఆ సినిమా బాలేదని ఎవరూ చెప్పలేదు.. సెకండాఫ్లో మార్పులు చేసుంటే బాగుండేదని అన్నారంతే" అని తెలిపారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1861 :** బెంగాలీ విద్యావేత్త, రసాయన శాస్త్రజ్ఞుడు ప్రఫుల్ల చంద్ర రాయ్ జననం (మ.1944).
- **1870 :** ప్రపంచంలో మొదటి భూగర్భ ట్యూబ్ రైల్వే, టవర్ సబ్వే, లండన్లో ప్రారంభించారు.,.
- **1878 :** భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారతదేశ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జననం (మ.1963). (చిత్రంలో)
- **1922 :** టెలిఫోన్ ఆవిష్కర్త, స్కాటిష్-కెనెడియన్ శాస్త్రవేత్త అలెగ్జాండర్ గ్రాహంబెల్ మరణం. (జ. 1847).
- **1924 :** స్త్రీవాద రచయిత్రి, హేతువాది, స్త్రీ స్వేచ్ఛ పత్రిక సంపాదకురాలు మల్లాది సుబ్బమ్మ జననం (మ. 2014).
- **1932 :** ఎలక్ట్రాన్ వ్యతిరేక కణమైన పాజిట్రాన్ ను కార్ల్ డేవిడ్ అండర్సన్ కనుగొన్నాడు.
- **1966 :** ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన క్రికెట్ క్రీడాకారుడు ఎం.వి.శ్రీధర్ జననం. (మ. 2017)
- **1979 :** సినీ సంగీత దర్శకుడు, గాయకుడు, గీత రచయిత దేవి శ్రీ ప్రసాద్ జననం.



ప్రఫుల్ల చంద్ర రాయ్


లండన్


పింగళి వెంకయ్య


అలెగ్జాండర్ గ్రాహంబెల్


మల్లాది సుబ్బమ్మ


కార్ల్ డేవిడ్ అండర్సన్


ఎం.వి.శ్రీధర్


దేవి శ్రీ ప్రసాద్



## రూట్ అలా ప్రవర్తిస్తాడని అనుకోలేదు: ప్రసిద్ధ కృష్ణ



లండన్ లోని ఓవల్ మైదానం వేదికగా ఇంగ్లాండ్– భారత్ జట్ల మధ్య ఐదో టెస్టు జరుగుతోంది. నిన్న రెండోరోజు ఆట సమయంలో జోరూట్– ప్రసిద్ధ కృష్ణల మధ్య చిన్నపాటి మాటల యుద్ధం జరిగింది. సాధారణంగా జో రూట్ ఇలాంటివాటిపై ఆసక్తి చూపించడు. ప్రసిద్ధ్ కూడా తన దారిన తాను బౌలింగ్ చేసుకుంటూ వెళ్లే బౌలర్. ఈ క్రమంలో తమ మధ్య చోటుచేసుకున్న సంవాదంపై ప్రసిద్ధ్ స్పందించాడు. "ఇదంతా ఆటలో భాగమే అనుకుంటున్నా. మైదానం ఆవల మేమిద్దరం మంచి స్నేహితులం. మ్యాచ్ సమయంలో ఉండే భావోద్వేగంలో భాగంగానే ఇలా జరిగింది. మేమిద్దరం దానిని ఆస్వాదించాం. ఈ టెస్టులో నా రిథమ్ బాగుంది. బౌలింగ్ చేయడాన్ని చాలా ఎంజాయ్ చేశా. వికెట్లు వస్తుంటే ఆ ఉత్సాహమే వేరుగా ఉంటుంది. ఇక రూట్తో జరిగిన దానిపై పెద్ద చర్చ అవసరం లేదు. కానీ, రూట్ అలా స్పందిస్తాడని నేను అస్సలు అనుకోలేదు. ఇప్పటికే నేను చెప్పినట్లుగా అతడు లెజెండ్ క్రికెటర్. అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తాడు. అలాంటి ప్లేయర్తో కలిసి ఆడటం అద్భుతమైన అనుభవం" అని ప్రసిద్ధ వెల్లడించాడు.

## ఇంటి చిట్కాలు

### కొన్ని చిట్కాలతో ఇంట్లోనే సులువుగా కొత్తిమీర పెంచుకోవచ్చు, ఎలా నాటాలంటే

కొత్తిమీర మొక్కను ఇంట్లో చాలా సులువుగా పెంచుకోవచ్చు. కాకపోతే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. మరి ఆ జాగ్రత్తలేంటి. ఏం చేస్తే మొక్క ఎదుగుతుందో తెలుసుకుందాం.

రోజూ వంటల్లో వాడే పదార్థాల్లో కొత్తిమీర కూడా ఒకటి. ఏ కూర చేసుకున్నా సరే. చివర్లో కాస్తంత కొత్తిమీర వేస్తే ఆ ఫ్లేవర్ మొత్తం మారిపోతుంది. గార్నిషింగ్ కోసం వాడినా సరే. రుచి మాత్రం అదిరిపోతుంది. సలాడ్స్ లో కాస్తంత ఎక్కువగా వాడుతుంటారు. ఇంకొందరు ధనియాల పొడి వాడతారు. కానీ..పొడి కన్నా ఇలా..ఆకులను నేరుగా కలిపి తీసుకుంటే ఆ రుచే వేరు. అయితే..కొత్తిమీర ఎక్కువగా వినియోగించడం వల్ల ఎక్కువగా కొనాల్సి వస్తుంది.ప్రతిసారీ ఇలా మార్కెట్ లో నుంచి పట్టుకురావడం అంటే ఖర్చుతో కూడుకున్న పని. అలా కాకుండా ఇంట్లోనే చాలా సులువుగా కొత్తిమీర పెంచుకుంటే సరిపోతుంది. ఎప్పుడంటే అప్పుడు అలా క్షణాల్లో తెంపి వాడుకోవచ్చు. అయితే.. ఇలా ఇంట్లో పెంచుకోవాలంటే మాత్రం తప్పనిసరిగా కొన్ని చిట్కాలు పాటించాలి. సరిగ్గా పాటిస్తే సులభంగానే కొత్తిమీర మొక్కను ఇంట్లో పెంచుకోవచ్చు.

#### ఎలా నాటాలి

కొత్తిమీర ఇంట్లో పెంచుకోవాలంటే ముందుగా ధనియాలు తీసుకోవాలి. వాటిని కాస్తంత దంచాలి. ఇలా నలిగిన ధనియాలను ప్రత్యేకంగా ఓ కప్పులు పోసి ఉంచాలి. మామూలుగా అయితే ఏ సీజన్ లో అయినా సరే ఈ మొక్కను పెంచుకోవచ్చు. అయితే వేసవిలో అయితే ఇంకాస్త అనుకూలమైన వాతావరణం ఉంటుంది. త్వరగా పాడైపోకుండా మొక్క నిలబడుతుంది. మిగతా సీజన్స్ లో కూడా సరైన విధంగా జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. మామూలుగా అయితే 40 నుంచి 45 రోజుల్లో మొక్క పెరుగుతుంది. ఏడాదిలో రెండు మూడు సార్లు ధనియాలు నాటుతూ ఉంటే కొత్తిమీర పుష్కలంగా ఎదుగుతుంది. ముందుగా ఓ కుండీలో మట్టి నింపాలి. ఆ తరవాత అందులో కాసిన్ని నీళ్లు పోయాలి. తేమ ఉండగానే అంతకు ముందే దంచి పెట్టుకున్న ధనియాలను ఈ మట్టిలో చల్లాలి. ఆ తరవాత ఏం చేయాలో స్టెప్ బై స్టెప్ తెలుసుకుందాం.



#### తరవాత ఏం చేయాలంటే



ఇలా ధనియాలను మట్టిలో చల్లిన తరవాత పైన మట్టి కప్పాలి. అయితే..ఇక్కడ కచ్చితంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే..కొత్తిమీర మొక్క త్వరగా ఎదగాలంటే ఓ చిట్కా తప్పనిసరిగా పాటించాలి. ధనియాలను దంచుకున్న తరవాత కచ్చితంగా కొన్ని గంటల పాటు నీళ్లలో వాటిని నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల త్వరగా మొకలకు రావడానికి ఆస్కారం ఉంటుంది. ఇక మట్టిలో నాటిన తరవాత దానిపైన మరోసారి కాస్తంత మట్టిని చల్లాలి. మామూలుగా అయితే 17-27 డిగ్రీల సెల్సియస్ మధ్యలో కొత్తిమీర చాలా బాగా ఎదుగుతుంది. అందుకే.. సూర్యరశ్మి తగిలే చోట ఉంచడం మంచిది. అదే సమయంలో రూమ్ టెంపరేచర్ వద్ద ఉండేలా చూసుకోవాలి. ఇదే కొత్తిమీర పెరగడానికి అనుకూలమైన వాతావరణం. అయితే..ట్రేలలో కాకుండా తప్పనిసరిగా కుండీలోనే పెంచుకోవాలి. అలా అయితే ఆకులు ఎక్కువగా వస్తాయి.

#### ఈ చిట్కాలు ఫాలో అవండి



సూర్యరశ్మి తగిలే చోట ఉంచడం మాత్రమే కాదు. కచ్చితంగా ఎలాంటి మట్టి వాడుతున్నారో చెక్ చేసుకోవాలి. ఎక్కువ సమయం పాటు తేమను పట్టి ఉంచే మట్టి అయితే చాలా బెటర్. దీని వల్ల మొక్కకు సరైన విధంగా పోషకాలు అందుతాయి. అయితే..ధనియాలు ఏదో పైపైన చల్లి ఉంచడం కాకుండా ఓ అర ఇంచు వరకూ మట్టి తవ్వి అందులో వేస్తే మంచిది. ఇక గింజలను పక్క పక్కనే వేయకూడదు. వాటి మధ్య కచ్చితంగా గ్యాప్ ఉండేలా చూసుకోవాలి. అంటే వాటిని దూరం దూరంగా చల్లాలి. ధనియాలు వేసిన తరవాత కనీసం ఓ అర ఇంచు మేర వాటిపై మట్టి కప్పాలి. కప్పిన తరవాత గట్టిగా ప్రెస్ చేయాలి. మల్చ్ వేస్తే ఇంకా మంచిది.

#### వాటరింగ్


వాటరింగ్

కొత్తిమీర సరైన విధంగా ఎదగాలంటే కచ్చితంగా నీరు సరైన విధంగా పోయాలి. అయితే..మట్టి మరీ ఎండిపోయినట్టుగా అయినప్పుడు మాత్రమే నీరు పోయడం మంచిది. మరీ అతిగా చేస్తే వేర్లు పాడైపోతాయి. ఫలితంగా మొక్క ఎదగదు. మట్టి క్వాలిటీగా ఉండేలా చూడాలి. వేర్లు గట్టిగా పట్టి ఉంచడంతో పాటు నీరు పోసినప్పుడు వేర్ల వరకూ ఆ తేమ చేరుకునే విధంగా ఉండాలి. వీలైనంత వరకూ ఆర్గానిక్ ఎరువులను వాడడం మంచిది. కొత్తిమీర ఆకులు రావడానికి కనీసం రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది. పాలకూర ఎలా అయితే కాస్తంత చల్లని వాతావరణంలో పెరుగుతుందో కొత్తిమీర కూడా అలాగే పెరుగుతుంది. కాకపోతే..ఎంతో కొంత సూర్యరశ్మి మాత్రం తగలడం మంచిది. అలా అని పూర్తిగా ఎండలో పెట్టడం సరికాదు. కాస్త ఇన్ డైరెక్ట్ గా కిరణాలు తగిలే చోట ఉంచితే బెటర్.

#### మరి కొన్ని జాగ్రత్తలు



కొన్ని సార్లు కొత్తిమీర ఆకులు సరిగ్గా రాకుండానే నేరుగా పూలు వచ్చేస్తాయి. మరీ వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది. సరిగ్గా నీళ్లు పోయకపోయినా తరచూ కుండీలు మార్చినా ఇలా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మట్టిలో తప్పనిసరిగా తేమ ఉండేలా చూసుకోవడం ముఖ్యం. నీడ ఉండే చోట కుండీని పెట్టకూడదు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే నాలుగు వారాల్లోనే మొక్క సరైన విధంగా ఎదుగుతుంది. మధ్య మధ్యలో ఆకులు తెంపుతూ ఉండాలి. ఇలా చేయడం వల్ల కొత్తగా ఆకులు వస్తాయి.



**గమనిక**

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించడం జరిగింది.